క్లుప్తంగా

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, ఆలయ ప్రతినిధులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతివారం ఒక దాత సహకారంతో ఈ అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, సభ్యులు బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహ కోశాధికారి సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు తక్షణమే ఫీజులు చెల్లించాలి

దాబాగార్డెన్స్ : గత మార్చి–మే నెలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కాని విద్యార్థులు తక్షణమే పరీక్ష ఫీజు చెల్లించాలని విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ జె. విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు తప్పిన విద్యార్థులు బాలికల కళాశాలలో తరగతులకు కూడా హాజరు కావచ్చన్నారు. ఫీజులు త్వరగా చెల్లించాలన్నారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఇంటర్ విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించారు.

ఉద్యానవనంలో మహనీయుల చిత్రాలు


వాకర్స్ పార్కులో క్లబ్ గోడపై మహనీయుల చిత్రాలు వేస్తున్న కళాకారులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో మహనీయుల కుడ్య చిత్రాల పెయింటింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇక్కడికి వచ్చే సందర్శకులు, చిన్నారులు, విద్యార్థులు, వాకర్స్‌లో దేశభక్తిని కలిగించేలా పలువురు మహనీయుల కుడ్య చిత్రాలు ఏర్పాటు చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు తదితరుల చిత్రాలను వాకర్స్ పార్కు చిత్రాలకు సంబంధించి గోడలపై పెయింటింగ్ పనులు చేస్తున్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో చిత్రకారులు చిత్రాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. త్వరలోనే వీటిని పూర్తి చేసి సందర్శనకు ఏర్పాటు చేస్తామని చంద్రమౌళి తెలిపారు.

గాయత్రి విద్యాపరిషత్‌లో 'ప్రకృతి 2కే23'



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వప్న


ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రకృతి 2కే23 పేరిట బయో ఫెస్ట్ నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఫెస్ట్‌లో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, డిబేట్, క్విజ్ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జీవీఎంసీ ఎన్విరాన్‌మెంటల్ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ మన సమష్టి బాధ్యత అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రే లక్ష్యం

రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సత్సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహింపజేస్తున్నారు. రూపాయి ఖర్చు లేకుండా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం వారి చెంతకెళ్లి మరీ అందిస్తున్నారు. ఈ శిబిరాలకు హాజరవుతున్న పేద ప్రజలు తమ పట్ల సీఎం జగన్‌కు ఉన్న శ్రద్ధకు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయన పాలనాతీరును కొనియాడుతున్నారు.


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్


శిబిరంలో వృద్ధురాలి ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది


వేంకటేశ్వరమెట్టకు చెందిన వైకుంఠరావుకి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- వేంకటేశ్వరమెట్టలో జగనన్న సురక్షకు హాజరైన ప్రజల మనోగతం
- సచివాలయం పరిధిలో 274 మందికి వైద్య పరీక్షలు
- మెరుగైన వైద్యం నిమిత్తం వివిధ ఆస్పత్రులకు ఆరుగురి తరలింపు

అల్లిపురం : ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జోన్–3లోని 33,34,35,41 వార్డుల క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ తెలిపారు. వేంకటేశ్వరమెట్ట–1 సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 274 మందిని వైద్యులు పరీక్షించారు. వారిలో ఆరుగురికి మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. వారిలో ఇద్దరికి న్యూరాలజీ, ఒకరికి గైనకాలజీ, ఇద్దరికి పీడియాట్రిక్, ఒకరికి ఆప్తమాలజీ వైద్య సేవలు అవసరం అవుతాయని నిర్ధారించారు. శిబిరం నిర్వహణ నేపథ్యంలో సుమారు 200 రకాల మందులు అందుబాటులో ఉంచారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై వైద్య శిబిరానికి వచ్చిన వారికి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పోషకాహారం నిమిత్తం ఎటువంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, మాదాబత్తుల రమేష్, ఆదారి వెంకటమహేష్ తదితరులు పాల్గొని తమ సహకారం అందజేశారు.

కంటి సమస్యతో వచ్చాను..


మాది వేంకటేశ్వరమెట్ట. కంటి సమస్యతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చాను. డాక్టర్లు తనిఖీ చేసి సూచనలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. వైద్య శిబిరంలో అందరినీ చక్కగా చూస్తున్నారు.

– జంపా సత్యవతి

మెరుగైన వైద్యం అందించారు..


నేను స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో వైద్య శిబిరానికి రమ్మని టోకెన్ ఇచ్చారు. వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. మంచి కార్యక్రమం.

– ఎం.మహేష్

మంచి కార్యక్రమం..


శిబిరంలో వైద్యులు చక్కగా చూశారు. అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. గ్యాస్ట్రిక్ సమస్యతో వచ్చాను. అవసరమైన మందులు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మంచి కార్యక్రమం చేపట్టారు.

– ఎం.రమ

చక్కగా పరీక్షలు చేశారు..


నేను కంటి సమస్యతో చెక్ చేయించుకునేందుకు వచ్చాను. డాక్టర్లు చక్కగా పరీక్షలు నిర్వహించారు. సమస్య పరిష్కారానికి సూచనలు చేసి మందులిచ్చారు. సీఎం జగన్ తలపెట్టిన కార్యక్రమం మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగం.

– ఓదూరి గణపతమ్మ

యుద్ధ బాధితులకు నివాళి


యుద్ధంలో అశువులు బాసిన వారికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీతమ్మధార : యుద్ధంలో అశువులు బాసిన పాలస్తీనియన్లకు పౌర, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ద్వారకానగర్ గురజాడ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ యుద్ధాలు వద్దు.. ప్రపంచ శాంతి ముద్దు అంటూ పలువురు నినాదాలు చేశారు. తాగునీరు, మందులు, నిత్యావసర వస్తువులు పాలస్తీనాకు సరఫరా కానీయకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో జె.వి. సత్యనారాయణమూర్తి, ఎం.పైడిరాజు, ఎ.విమల, శ్రీరామమూర్తి, కృష్ణ, వెంకటలక్ష్మి, నిర్మల, సీతామహాలక్ష్మి, పుష్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమాయక ప్రజలపై దాడులు అమానుషం


నిరసన తెలుపుతున్న ముస్లింలు

దాబాగార్డెన్స్ : పాలస్తీనా అమాయక ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో గురువారం పలువురు ముస్లింలు జగదాంబ జంక్షన్ సమీపాన మక్కా మసీదు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై బాంబులు వేసి చంపడం దుర్మార్గమన్నారు. అక్కడి ప్రజలను దేశం విడిచి వెళ్లిపొమ్మని చెప్పడంపై మండిపడ్డారు. ప్రపంచంలో ఇజ్రాయిల్‌కు ఎక్కడా చోటు ఉండదని, మానవతా దృక్పథంతో చోటు ఇచ్చినందుకు చివరకు ఆసుపత్రిపై కూడా దాడి చేసి వందలాది మందిని చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో మక్కా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ మునీర్, కార్యదర్శి అమీర్ జాన్, జమైత్‌ఇస్లామి కార్యదర్శి ఇబ్రహీం, జబ్బర్ అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

'జిందాల్‌ను స్టీల్‌ప్లాంట్‌లోకి అనుమతించం'


సమావేశంలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్‌ను అనుమతించే ప్రసక్తి లేదని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు స్పష్టం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్–3ను జిందాల్‌కు అప్పగించాలని యాజమాన్యం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాలను, కార్మికులను చైతన్యపరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన సెంట్రల్ మిషన్ షాప్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ మొత్తం ప్రైవేటీకరణ ప్రక్రియపై ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఇలా ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కుట్ర జరుగుతోందన్నారు. బీఎఫ్–3ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే విశాఖ ఉక్కు మనుగడకు ప్రమాదం అవుతుందన్నారు. యాజమాన్యం ఈ ప్రయత్నాన్ని నిలిపివేయపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, జి.ప్రభాకర రెడ్డి, జి.గణపతిరెడ్డి, పరంధామయ్య, బి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూ

విద్యార్థుల భాగస్వామ్యంతో 'స్వచ్ఛతా హీ సేవ'


పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని పరిశుభ్ర క్యాంపస్‌గా తీర్చిదిద్దాలని ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు కోరారు. ఇందులో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. ఏయూ విద్యా విభాగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు శుభ్రం చేశారు. ముందుగా విద్యా విభాగం తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ డి.నాగరాజ కుమారి, విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ సాల్మన్ రాజు, డాక్టర్ మూర్తి, డాక్టర్ ప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవుడి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 28 వరకు ఉత్సావాలు నిర్వహిస్తామన్నారు. 22న వైభవుడికి ప్రత్యేక పూజల అనంతరం, కోలాటం, అమ్మవారికి అర్చన, తీర్థగోష్టి జరుగుతాయి. 23న పద్మావతి అమ్మవారికి అర్చన అనంతరం బి.యతిరాజు భాగవతాచార్యలచే హరికథా కాలక్షేపం ఉంటుంది. 24న ఆధ్యాత్మిక ప్రసంగాలు, 25న జమ్మి వాత్సల్య బృందం అన్నమాచార్య కీర్తనలు, 26న భరతనాట్యంతో నృత్య సేవ, 27న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో భజన, సత్సంగం, 28న పౌర్ణమి సందర్భంగా ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. 28న చంద్రగ్రహణం కారణంగా ఉదయం 9 గంటల వరకు మాత్రమే వైభవుడి దర్శనం ఉంటుంది.

నవంబర్ 25న విరాట్ హిందూ సమ్మేళన్ వేడుక

సీతమ్మధార: హిందూ సమాజాన్ని కాపాడుకోవాలనే నినాదంతో విరాట్ హిందూ సంఘ్ ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు డి.ఎస్.వర్మ తెలిపారు. గురుద్వారా దరి ఒక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవ నరసింహ క్షేత్రం సింహాచలం లాంటి పుణ్యప్రదేశం, దక్షిణ భారతదేశంలో లక్ష్మీదేవి, కనకమహాలక్ష్మిగా కొలువైన విశాఖ.. విభిన్న సంస్కృతులు, వివిధ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు ఇచ్చే ప్రదేశమన్నారు. విశ్వనగరంలో నవంబర్ 25న విరాట్ హిందూ సంఘ్ సమ్మేళన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హరి కేశవులకు ఇష్టమైన కార్తీక మాసంలో ఈ వేడుకను జరుపుతున్నామన్నారు.

ఈ సమ్మేళన్‌లో హనుమాన్ శోభాయాత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ ధార్మిక వేత్తలకు హిందూ ధార్మిక కార్యక్రమాలకు ప్రధాన సింహద్వారంగా ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు కపిల్ అగర్వాల్, రాఘవేంద్ర మిశ్రా, కె.హెచ్.వి.శర్మ, దుర్గాప్రసాద్, ఫణీంద్ర పాల్గొన్నారు.

రూపురేఖలు మారుతున్న పూర్ణామార్కెట్

శరవేగంగా రోడ్డు విస్తరణ... కాలువల నిర్మాణం


రోడ్డు విస్తరణ కోసం తొలగించిన దుకాణాలు



దుకాణాలు తొలగించిన తర్వాత విశాలంగా మారిన రోడ్డు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ రూపురేఖలు మారిపోతున్నాయి. ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడం తెలిసిందే. ఇందులో భాగంగా ఇక్కడి మెయిన్‌రోడ్డును 60 అడుగులకు విస్తరిస్తున్నారు. ఇప్పటికే జోన్–4 టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ చేయడంతో దుకాణాల యజమానులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి దుకాణాలలో కొంత భాగాన్ని తొలగిస్తున్నారు. దాదాపుగా ఈ విస్తరణ పనులు ఆఖరి దశకు చేరుకున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాలలో వన్‌టౌన్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీ సమస్యను తొలగించేందుకు రోడ్డు విస్తరిస్తున్నారు. సింహాచలం, వాల్తేరు, మద్దిలపాలెం డిపోలకు చెందిన సిటీబస్సులు పూర్ణామార్కెట్ మీదుగా పాతపోస్టాఫీసు, టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక వైపు వెళ్తుంటాయి. పూర్ణామార్కెట్ ఎదురుగా గల బస్టాప్ వద్ద సిటీ బస్సులు ఆగితే వెనుక వచ్చే వాహనాలు కూడా ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకుంటోంది. మరో వైపు రోడ్డు విస్తరణ క్లియర్ కావడంతో ఇంజినీరింగ్ విభాగం శరవేగంగా కాలువలు నిర్మిస్తున్నారు. వర్షాల సమయంలో ముంపు బెడద లేకుండా పెద్ద కాలువల నిర్మాణం జరుగుతోంది. పూర్ణామార్కెట్ నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు విస్తరణ పనులు పూర్తయితే ఇక్కడ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గిపోతుందని అధికారులు భావిస్తున్నారు.


రోడ్డు విస్తరణ తర్వాత నిర్మిస్తున్న కాలువలు

తల్లి చెంతకు చిన్నారులు


చిన్నారులను తల్లివద్దకు చేర్చిన కానిస్టేబుళ్లు బీవీ కిషోర్, ఎం.సతీష్

బీచ్‌రోడ్డు: దసరా సెలవులు కావటంతో చిన్నారులతో సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు ఇద్దరు కుమారులతో వచ్చిన తల్లి నుంచి చిన్నారులు తప్పిపోయారు. పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన చిన్నారులు అదిల్, అబిత్ తల్లితో కలిసి గురువారం రాత్రి ఆర్కే బీచ్‌కు వచ్చారు. వారు తల్లికి దూరంగా వెళ్లి ఆడుకోవడానికి వెళ్లి వేరు పడిపోయారు. దీంతో తల్లి గాబరా పడి బీచ్‌లో గల టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తమ గ్రూపులో మెసేజ్ ఫార్వార్డ్ చేయగా కానిస్టేబుళ్లు బీవీ కిషోర్, ఎం.సతీష్ చిన్నారులను బీచ్‌లో గుర్తించి తల్లి వద్దకు చేర్చారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. త్రీటౌన్ సీఐ కోరాడ అప్పారావు కానిస్టేబుళ్లను అభినందించారు.

అమ్మవు నీవే.. అఖిల జగాలకు


ధనలక్ష్మి అవతారంలో కన్యకాపరమేశ్వరి


లలితాదేవి అవతారంలో సాగరగిరి కనకదుర్గమ్మ


బాలా త్రిపుర సుందరి రూపంలో దుర్గాలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సామూహిక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం కన్యకాపరమేశ్వరి సరస్వతీదేవిగా దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, కంకటాల సతీష్, దుర్గా నూకేశ్వరరావు, దేవస్థానం మహిళా విభాగం సభ్యులు కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, పి. సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

బాలాత్రిపురసుందరిగా దుర్గాలమ్మ అమ్మవారు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో గల శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదో రోజైన గురువారం అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో పి.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు సకల సదుపాయాలు కల్పించారు. దేవస్థానం అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. రోజూ సాయంత్రం దేవస్థానం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బత్తి మంగరాజు, ధర్మకర్తలు డి.లక్ష్మీనారాయణ, కె.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, రమణమ్మ, డి.వేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పండ్ల అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

పండ్ల అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఎర్నిమాంబ అమ్మవారిని పలు రకాల పండ్లతో అలంకరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, జోజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 980వ రోజుకు రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 980వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.